# ఈ నెత్తుటి కూడు నాకొద్దు

కె. కుమారి

ఒక్క ఉదుటున కోడెదూడ దగ్గరికి వెళ్లాడు అంకడు. అది విదిలించి కొట్టడానికి సిద్ధమైనట్లు రౌద్రంగా ఉంది. అంకడు ఒక్క క్షణం ఆలోచించాడు. మరుక్షణం కోడెదూడ మూపురం పట్టుకొని, డొక్కలో మోకాల్తో పొడిచాడు. అది బాధకు కొద్దిగా వంగింది. అదే అదనుగా పొట్టదగ్గిర తలపెట్టి రెండేసి కాళ్లను ఒక్కోచేత్తో పొదివి పట్టి, అమాంతం పైకెత్తి భుజంమీద వేసుకొని, కొడెదూడను గిరగిర త్రిప్పి విసిరి దూరంగా పారేశాడు అంకడు.

చుట్టూ చప్పట్లతోను, ఈలలతోను, కేరింతలతోను, అరుపులతోను మారు మోగిపోతుండగా—

వెళ్ళి బంగారు పతకం అందుకున్నాడు అంకడు.

జాజి ఆనందానికి అవధులు లేవు ఆ క్షణంలో.

నిజంగా జాజి స్వయంవరంలోని సీతే అయిఉంటే, అంకడి మెడలో పూలదండ వేసేదేమో! కానీ, అది సంత కాబట్టి, నునుసిగ్గుతో తన ఆలోచనలకు లోలోన నవ్వుతూ ఉండిపోయింది జాజి.

సూర్యానికి అరికాలి మంట నెత్తి కెక్కింది. కనుబొమలు నొసలు తాకింది. అతడి కోపం చెమటగా కారుతుండగా, వాళ్ళిద్దరిని కొరకొర చూస్తూ వెళ్ళిపోయాడు.

* * *

ఆ రోజు.

అంకడు మామిడితోటలో చెట్టెక్కి కాయలు కోస్తున్నాడు.

కోసిన కాయల్ని నవ్వుతూ ఎగిరి అందుకొంటోంది జాజి.

"ఇదేం కాయలు అమ్మాయిగారు! మాతోటలో కాయిలు చూశారంటే తొటను వదిలి పెట్టరు," అన్నాడు అంకడు.

"ఈ సారి మీ తోటకు వస్తానులే. అవునూ, బంగారు పతకం ఏం చేశావు?" అడిగింది జాజి.

సహజంగా ఆడవాళ్ళ ముఖాల్ని అలరించే సిగ్గు, అంకడు మొగాడన్న సంగతి మరచి అతని ముఖాన్ని ఆవ రించింది. అంకడు మెలికలు తిరిగి పోతున్నాడు — జాజికి సమాధానం చెప్పలేక.

"ఎందుకురా! అలా సిగ్గు పడిపోతున్నావ్? చెప్పు."

"దాన్ని ..... దాన్ని.... అమ్మాయిగారూ....!"

"ఓహో! కాబోయే శ్రీమతి కోసం భద్రపరచావా?" అని పకపకనవ్వుతూ ఉంది జాజి.

నవ్విన నవ్వుకు అడ్డుగా వచ్చిన దగ్గులా వచ్చాడు అక్కడికి సూర్యం.

జాజి అతన్ని చూసి కూడా చూడనట్లు కాయలు అందుకుంటూ ఉండిపోయింది.

సూర్యానికి జాజి ప్రవర్తనతో ఒళ్ళు మండిపోయింది.

"జాజీ....," అని పిలిచాడు ఆగ్రహాన్ని దిగమింగుతూ సూర్యం.

"ఏం...?" అన్నట్లు నిర్లక్ష్యంగా చూసింది జాజి.

"ఎక్కడ బడితే అక్కడికి నువ్వు ఈ కడజాతి నాకొడుకుతో తిరగడం నాకేం నచ్చలేదు"

"నీకు నచ్చాలని నేను తిరగడం లేదు. అయినా నువ్వెవరు ఆ మాట నన్నడగటానికి," అని కాయలు అందుకుంటూ —"అంకా! ఆహా... అదికాదు. ఆ కాయకోసుకో...," చూపుడు వేలు పెట్టి చూపిస్తూ అంది జాజి.

అంకడు ఏం మాట్లాడ కుండా కాయలు కోస్తున్నాడు.

"నేనెవర్నా? నీ మెడలో తాళికట్టబోయేవాడ్ని" అన్నాడు సూర్యం.

"ఎవడన్నాడామాట?"

"నేనే అంటున్నాను."

ఆ మాటలతో జాజి పకపక నవ్వింది.

"ఎందుకా నవ్వు?" ఉడుక్కుంటూ అడిగాడు సూర్యం

"అచ్చోసిన ఆంబోతులా ఊరంతా తిరిగే నీకు పెళ్ళా? ఆ మాట అనడానికి సిగ్గు లేదూ...?"

"ఏం కూశావే... నిన్నూ....," అని జాజి చెయ్యి పట్టుకొన్నాడు సూర్యం.

జాజి తన చేతిని విడిపించుకోవడానికి గింజుకుంటోంది.

సూర్యం బలవంతంగా ఆమెను గుండెలపైకి లాక్కోబోయాడు.

పరిస్థితి గ్రహించిన అంకడు చెట్టుపైనుండి వాళ్ళిద్దరి మధ్యకు దూకాడు. దాంతో జాజి చెట్టుకు చేరగిలబడింది. సూర్యం కొద్ది దూరంలో వెళ్ళి పడ్డాడు.

మళ్ళీ సూర్యం జాజి మీదకు ఉరకబోయాడు.

"ఆ యింటి ఎంగిలి తిన్న కుక్కను. అమ్మాయిగారి మీద యిప్పుడు చెయ్యి పడిందంటే...!" అని బొడ్డులో దోపుకున్న కత్తి చేతిలోకి తీసుకున్నాడు అంకడు.

అంతాక్షణంలో జరిగిపోయింది.

అంకడు చేతిలో కత్తి చూడటంతో భయపడిపోయిన సూర్యం —"ఓరేయ్! మా మోచేతి కింద నీళ్ళు తాగి బతికే నాకొడక. చూస్తానురా, నువ్వెంతో, నీ బతుకెంతో చూస్తాను." అని కసిగా అంటూ వెళ్ళి పోయాడు.

* * *

"నాన్నా! వాడిని యిలాగే వదిలేస్తేకాదు. నా విషయంలో అన్నిటికి అడ్డుపడుతున్నాడు. వాడి పొగరు అణచాలి" ఆవేశంగా అన్నాడు సూర్యం.

మాటు వేసి కాటు వెయ్యడం అలవాటు నాగయ్యకు.

"ఓరేయ్! నీలా తొందర పడితే కాదు. నిదానించు. జాజిని వలలో వేసుకోవడం చేతగాక మాటలు మాట్లాడకు. ఎలా చెయ్యాలో నాకు తెలుసు..." అని నాగయ్య కొడుకు చెవిలో ఏదో ఊదాడు.

సూర్యం ముఖం పూతకొచ్చిన కందిచేనులా అయ్యింది.

పథకం ప్రకారం ఆరోజు రాత్రి అంకడి మామిడి తోటను పూర్తిగా నరికించేశాడు.

ప్రొద్దున వచ్చి నరికేసిన మామిడి తోటను చూసి అంకడు అచేతనుడయ్యాడు. పొక్కడి గుండె పొక్కిపోయింది.

ఇంతలో కుల పెద్ద మీరయ్యకు ఈ విషయం తెలిసి ప్రెసిడెంట్‌కు, పోలీసులకు తెలియజేశాడు. అందరూ వచ్చారు.

పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.— "మీకు ఎవరి మీదైనా అనుమానంగా ఉందా?" అడిగాడు యస్.ఐ.

పొక్కడు ఎవరి మీదా లేదని తల అడ్డంగా ఊపాడు.

అంకడికి ముందురోజు జరిగిన ఉదంతం గుర్తుకొచ్చి, సూర్యం మీద అనుమానం కలిగి అతని పేరు చెప్పాడు.

"ఎవడైనా సరే! నాకు అన్యాయం చేసినా ఊరుకుంటానేమోగాని, నాఇంట్లో పని చేసే పాలేర్లకు అన్యాయం చేస్తే నేను ఊరుకోను. యస్.ఐ.గారు! ఈ కేసును దగ్గరుండి మీరే విచారించాలి." కండువా సరి చేసుకుంటూ ఠీవిగా అన్నాడు ప్రెసిడెంట్ రుద్రయ్య.

ఆమాటతో అక్కడే ఉన్న నాగయ్య గొంతు

**వెలివాడ నుండి అక్కడికి తప్పెటలు, బాజాలు వాయించుకుంటూ – బూరుగులు, కొమ్ములు వూదుకుంటూ ఈలలు వేస్తూ — అరుస్తూ —గెంతుకుంటూ కొందరు వస్తున్నారు. అంకడు పలుపు పట్టుకొని దున్నపోతుని లాక్కొస్తున్నాడు.**

తడారింది.

తన గుట్టు రట్టయ్యి కొడుక్కి శిక్ష పడుతుందేమో అని భయపడ్డాడు.

చివరకు ఆలోచించి ఒక పన్నాగం పన్నాడు.

*　　*　　*

"అయ్యా! మీ వెంట యిలా నడుస్తూంటే రాయలు వారి వెంట నడిచినట్లు ఉందండీ," నక్క వినయాలు నటిస్తూ అన్నాడు, పొలంగట్టుపై రుద్రయ్య వెనకాల నడుస్తున్న నాగయ్య

ఆ మాటకు గంభీరమైన ఒక పొడినవ్వు సమాధానంగా యిచ్చి, పంట పొలాలను చూస్తూ ముందుకు కదిలాడు రుద్రయ్య.

"ఆ రుద్రుడికి నాగయ్య మెడకు ఆభరణం అయితే, ఈ నాగయ్య మీ పాదాలకు ఆభరణం లాంటివాడు. మీ వంశ మెంత గొప్పదో, మీ మనసంత గొప్పదండి, మీ రెంత సహాయం చేసినా కొంచెమైనా యిశ్వాసం లేకుండా ఆ వెధవలు మీ పరువు, ప్రతిష్ఠలు బజారు కెక్కించాలని చూస్తున్నారండీ." అన్నాడు నాగయ్య.

నాగయ్య చెప్తున్న దేమిటో అర్థంగాక బృుకుటి ముడిచి తీక్షణంగా చూశాడు రుద్రయ్య.

ఆ చూపుకు నాగయ్య గుండె కొంచెం గుబగుబలాడింది. అయినా తెప్పరిల్లి — "అవునయ్యా! మీ కాళ్ళ దగ్గిర కుక్కల్లా బతికే యదవలును మీరు వాళ్ళకులమని చూసినారా? డబ్బుని చూసినారా? మొన్నగాక మొన్న ఆ తోట విషయంలో మీ రెంత సహాయం చేశారు. అయినా ఏం లాభం? గుణంకూడా లేని



నా కొడుకులంటే... మీ ఉప్పు తింటూ మీకే ...'' అని ఆ మాటసగంలోనే నసుగుతూ ఉండిపోయాడు నాగయ్య.

''నాగయ్యా! కాస్త అర్థమయ్యేట్లు చెప్పిచావు,'' అసహనంగా అన్నాడు రుద్రయ్య.

''మీరు చేసిన సహాయం వలన ఈ రోజు ఈ ఊళ్ళో భూస్వామిగా బతకగలుగుతున్నాను. దేవుడు లాంటి మీకు అన్యాయం జరుగుతూంటే — చూస్తూ ఊరుకోవడం నా వల్లకాదుబాబు. మీ ప్రాణానికి ప్రాణమైన అమ్మాయిగారిని....''

ఆ మాటతో నడుస్తున్న రుద్రయ్య ఆగాడు.

ఇదే అదను అనుకొని నాగయ్య చెప్పటం మొదలు పెట్టాడు— ''ఆ అంకడూ, వాడి అన్న పొక్కడూ మీ దగ్గిర లేని వినయాలు నటిస్తూ, అమ్మాయిగారికి మందు పెట్టి, వళ్లో వేసుకొని మీ ఆస్తంతా కొట్టెయ్యాలని చూస్తున్నారు...''

''నాగయ్యా.....'' కోపంగా అరిచాడు రుద్రయ్య.

''నా మాట మీద నమ్మకం లేకపోతే, అటూ ఆ చెరువు గట్టు మీద చూడండి. మీకే అర్థమవుతుంది,'' అన్నాడు నాగయ్య.

రుద్రయ్య అటు చూశాడు.

* * *

చెరువు గట్టు మీద అంకడు కాళ్ళ మధ్య తల వంచి దిగులుగా కూర్చొని ఉన్నాడు. అతడికి కొద్ది దూరంలో చెట్టుకు ఆనుకొని జాజి నిలుచుకొని ఉంది.

దిష్టి నీళ్ళు కలిపి పెట్టిన ఎర్రనీళ్ళ తట్టలా ఉంది ఆ చెరువు.

దిష్టి ఎర్రనీళ్ళ తట్టలో మండుతున్న కర్పూరంలా ఉన్నాడు పడమట ఉన్న సూర్యుడు.

మండుతున్న కర్పూరం నుండి వస్తున్న మసిలా, ఆకాశంలో గాలికి కదులుతున్నాయి నల్లటి మేఘాలు.

ప్రకృతి జాజి అందానికి దిష్టి తీస్తోందా అన్నట్లు ఉంది ఆ దృశ్యం.

''అంకా! ఎంతసేపు అలా బాధపడుతూ కూర్చుంటావు. ఇదంతా నా మూలంగానే జరిగింది,'' అంది జాజి.

''లేదమ్మాయిగారు... మీ మూలంగా కాదు. మా తలరాత అలా చేసింది. ఆ తోట మీద నేను, మా అన్న ఎన్నో ఆశలు పెట్టుకొని పెంచాం. ఈ యేడు కాయలమ్మి, అయ్యగారి దగ్గిర మా నాయన చేసిన అప్పులన్నీ తీర్చేసి హాయిగా బతకాలనుకున్నాం. అంతే,'' ఆ పైమాటలు పెగల్లేదు అంకడికి.

''పోనీలే అంకా! నే దాచుకున్న డబ్బులు యిస్తాను. మీ అప్పులన్నీ తీర్చేయ్.''

ఆ మాటతో అంకడి కండ్ల నుండి అశ్రువులు రాలాయి. అవి ఆనంద భాష్పాలో లేక ఆత్మ ఘోషనో అర్థంకాలేదు. చెమర్చిన కండ్లతో — ''మీరు.... మీరు దాచుకున్న డబ్బులా! వద్దమ్మాయిగారు!'' అన్నాడు.

''వచ్చే వారం కోర్టులో నిజమేదో తెలుస్తుంది. అప్పుడు ఆ సూర్యానికి తగిన శాస్తి జరుగుతుంది.''

''సూర్యం వాళ్ళు డబ్బున్నోళ్ళు. ఎలాగైనా తప్పించుకుంటారు అమ్మాయిగారు. మాలాంటోళ్లే చివరికి నలిగి నలిసి చితికి పోయేది.''

''ఛఛ!! అవేం మాటాలు అంకా. మా నాన్న ఉన్నంత వరకు నీకు అలా ఎన్నడూ జరగదు. వాళ్ళు డబ్బుతో ఏం చేయలేరు. నువ్వు ఇలా బాధగా కూర్చుని ఉంటే చూళ్ళేను. ఏది ఒకసారి నవ్వవా...?''

.......

''ఇదిగో! నువ్వు నవ్వక పోతే ఈ చెరువులో దూకేస్తాను,'' అంటూ ముందుకు కదిలింది జాజి.

''అమ్మాయిగారు....'' అంటూ అదుర్దాగా జాజి చేయి పట్టుకున్నాడు అంకడు.


ఇద్దరి హృదయాలు పొంగాయి.

పొంగిన హృదయాలు నవ్వులుగా విరిశాయి.

* * *

ఇదంతా చూస్తున్న రుద్రయ్య రుద్రుడై పోయాడు.

''నా ఎంగిలి తిని, నాకాళ్ళ కింద చెప్పులా పడి ఉండే వెధవ? నాకూతురు మీదే చెయ్యేస్తాడా? వాడ్ని నిలువునా నరికేస్తాను. వాడి రక్తం....,'' అని ముందుకు ఉరికాడు రుద్రయ్య.



## అయిడియా

మొట్టమొదటి సారిగా హైహీల్స్ చెప్పులు కనుక్కొని, తయారుచేయించుకున్న మార్గరెట్‌ని ఇంటర్‌వ్యూ చేస్తున్నారు.

''మీకీ అయిడియా ఎలా వచ్చింది?'' అడిగాడు ఓ విలేఖరి.

''నాభర్త నన్ను రోజూ నుదుటి మీద ముద్దుపెట్టుకోవడం వలన'' ఠక్కున చెప్పింది మార్గరెట్.

—యస్.డి. గిరి (అనంతపురం)

నాగయ్య అతన్ని వారిస్తూ – ''అయ్యా! మీరిలా ఆవేశ పడితేకాదు. ఇది మీ వంశగౌరవానికి — అమ్మాయి జీవితానికి చెందిన విషయం. కాస్తనా మాట విని నిదానంగా ఆలోచించండి'' అన్నాడు.

''లేదు నాగయ్యా!... వాడ్ని..,'' అంటూ ప్రళయ తాండవం చేశాడు రుద్రయ్య.

''అయ్యా! కాస్త ఆలోచించండి. మీరిప్పుడు వాడ్ని కొడతారు, చంపుతారు బాగానే ఉంది. దాంతో సమస్యలు పరిష్కారమవుతాయా? ఈ విషయం ఊరంతా తెలుస్తుంది. ఆ తర్వాత అంకడితో సంబంధం వుందని, అమ్మాయిగారిని పెళ్ళి చేసుకోవడానికి ఏ సంబంధం రాదు. దాంతో అమ్మయిగారి జీవితం నాశనమవుతుంది. ఈ ఊళ్ళో మీ పరువు వీధికెక్కుతుంది. మనం కులం చెడిన వాళ్ళమవుతాము. మనంగా మన చేతుల్ని కాల్చుకున్నట్లవుతుంది.'' అన్నాడు నాగయ్య.

''ఈ యదవకి సహాయం చేసి, నీ కొడుకు విషయం. కోర్టు వరకు తీసుకెళ్ళాను. నీకు అన్యాయం చేశాను. నన్ను క్షమించు నాగయ్య''


''దేవుడు లాంటి వారు. మీరలా మాట్లాడకూడదు,'' అని లేని భక్తి నటించాడు నాగయ్య.

''వచ్చేవారం కోర్టులో అంకడు సాక్ష్యం చెబితే ... నీ కొడుకు సూర్యానికి ...'' అని ఏదో చెప్పబోయాడు రుద్రయ్య.

''అయ్యా మీరేం బెంగపడవద్దు. కోర్టులో సాక్ష్యం చెప్పడానికి వాడు వస్తేకదా,'' తాపీగా అన్నాడు నాగయ్య.

రుద్రయ్య ఆలోచనగా నాగయ్యను చూశాడు.

''మీరు చూస్తూ ఉండండి. మనకులాన్ని, మనల్ని వీధికీడ్చాలనుకున్న కులంలేని నాకొడుకుని, మన చేతికి మట్టికాకుండా చేసేపని నేను చేయిస్తాను,'' అని తను వేసిన పాచిక ఫలిస్తున్నందుకు లోలోపల ఆనందపడుతూ





## కోరిక

"స్వయంగా నేను డాక్టర్‌నయివుండి నిన్ను నేను బ్రతికించుకోలేక పోతున్నాను కాంతం" అన్నాడు మృత్యుంజయరావు విచారంగా మంచం మీదున్న భార్య చేతులు పట్టుకుని.

"అయిందేదో అయిపోయింది అయితే ఇంకెప్పుడూ మన ఇంటిలో ఎవరికి సుస్తీ చేసినా మీరు వైద్యం చేయనని మాట యివ్వండి. ఇదే నా ఆఖరి కోరిక" నీరసంగా అంది కాంతం

—బద్దిగం అరుణశ్రీ (కరీంనగర్)

హామీ ఇచ్చాడు నాగయ్య.

* * *

ఆ వారం ఆ పల్లెలో జాతర.

మొదటి రోజు చాటు. చాటు జరిగిన మరుదినం నుండి, జాతర ఆ వారమంతా రకరకాల వేషాలతో జరుగుతుంది. చివరి రోజున గంగమ్మకు పొంగలి పెడతారు. పొంగలి రోజు జంతువును బలి యిస్తారు బలి. ఇచ్చిన జంతువు రక్తంతో అన్నం కలిపి, ఆ నెత్తుటి కూడును ఊరంతా "పొలోపొలి," అని అరుస్తూ చల్లుతారు. దాన్నే "పొలి" చల్లడం అంటారు. అలా ఊరంతా నెత్తుటి కూడును చల్లితే, ఆ ఊరు సంక్షేమంగా ఉంటుందని ఆ ఊరి వాళ్ళ నమ్మకం.

అలా ఆ వారం రోజులు కనివిని ఎరుగనంత గొప్పగా, ఆనందంగా వేషాలు ముగిశాయి. చివరి రోజున గంగమ్మకు పొంగళ్ళు.

వీధులంతా పచ్చని వేపమండలతోను, రంగురంగుల ముగ్గులతోను అలంకరించారు.

రకరకాల పూలతో, కాగితాలతో, పుల్లలతో గోపురాల్లా తయారు చేసిన 'సప్రాలు' ఎత్తుకొని వెళ్ళేవాళ్ళు కాళ్ళకు గజ్జలు కట్టుకొని వళ్ళంతా చందనం పూసుకొని పూనకం వచ్చినట్లు ఎగురుతూ కోకొల్లలుగా గంగమ్మ గుడికి వెళుతున్నారు.

ప్రసిడెంట్ రుద్రయ్య ఇంటి ముందునుండి డప్పులు మొదలయ్యాయి. పొంగలి పెట్టే ముత్తయిదువలు, పట్టు-చీరలు కట్టి, గంపలు నెత్తిన పెట్టుకొని డప్పుగాళ్ళ వెంట గుంపుగా నడుస్తున్నారు. మొక్కుబడి ఉన్నజాజి కూడా పట్టు చీర కట్టి, గంప నెత్తిన పెట్టి వాళ్ళతో బయలుదేరింది. అన్ని వీధులు తిరిగి గంగమ్మ గుడి ముందుకు వచ్చి ఆగాయి డప్పులు. వాళ్ళ వెంట పెద్ద గుంపుగా వచ్చిన ముత్తయిదువలు, గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి, గంపలు దించి మూడు రాళ్ళు పెట్టి, పొయ్యిరాజేసి పొంగలి ఉడికిస్తున్నారు. జాజి కూడా పొంగలి పెట్టసాగింది. కానీ, ఆమె చూపులు దేని కోసమో వెతుకుతూనే ఉన్నాయి.

అమ్మవారికి పూజలు, హారతులు జరుగుతున్నాయి.

గుడిముందు పెద్ద వేప చెట్టు దాని చుట్టూ శూలాలు నాటబడి ఉన్నాయి.

గుడికి అటు ఇటు వరుసగా రకరకాల అంగళ్ళు అందంగా అమర్చినట్లున్నాయి. దానికి కొద్ది దూరంలో రంగుల రాట్నాలు తిరుగుతున్నాయి. కొందరు కోతులను ఆడిస్తున్నారు. సర్కస్ చేయిస్తున్నారు. ఆ ప్రదేశమంతా చాలా కోలాహలంగా ఉంది. ఎవరికి వాళ్ళు ఉత్సాహంతో తలమునకలవుతున్నారు.

ఒక పక్క లెక్కలేనన్ని కోళ్ళు కోస్తున్నారు.

వెలివాడనుండి అక్కడికి తప్పెటలు, భాజాలు, వాయించుకుంటూ, బూరుగలు, కొమ్ములు ఊదుకుంటూ, ఈలలు వేస్తూ "కితతతత", అని అరుస్తూ, ఎగురుకుంటూ గెంతుకుంటూ కొందరు వస్తున్నారు. వారి వెనుకాల పొక్కడు పదును తేలి మిలమిల మెరుస్తున్న జానెడు వెడల్పు, రెండడుగుల పొడుగు ఉన్న పెద్ద బలికత్తి భుజాన పెట్టుకొని వస్తున్నాడు. అంకడు పలుపు పట్టుకొని దున్నపోతును లాక్కొస్తున్నాడు.

పొక్కడి కుటుంబానికి జాతర్లో బలి పశువును నరకడం, వంశపారంపర్యంగా వస్తున్న ఆచారం.

అందరూ గంగమ్మ గుడి ముందు ధూప స్తంభం దగ్గర ఆగారు.

అంతసేపు వెతుకుతున్న కండ్లకు, పలుపుపట్టుకొని దున్న పోతును లాక్కొచ్చిన అంకడిని చూడగానే, జాజి మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది.

పసుపు రాసి, పెద్ద బొట్టు పెట్టి, పట్టుచీరకట్టి, తలనిండా మల్లె పూలు పెట్టి — "అమ్మోరే పొంగలి పెట్టడానికి వచ్చిందా?" అన్నట్లు ఉన్న జాజిని చూడగానే అంకడి మనసు భక్తి భావంతో నిండిపోయింది.

ప్రసిడెంట్ రుద్రయ్య, నాగయ్య, పోలీసులు, కొంతమంది ఊరి పెద్దలు అక్కడికి వచ్చారు.

కలెక్టరు సంతకం చేసి పంపించిన అనుమతి పత్రంపై, ఊరి పెద్దలు, సంతకాలు చేశారు. దాన్ని తీసుకొచ్చి అంకడు, ప్రసిడెంట్ రుద్రయ్య చేతికి యిచ్చాడు.

అంకడిని చూడగానే రుద్రయ్య ఒళ్ళు రగిలిపోయింది. అయినా తమాయించుకొని, ఆ పత్రంపై సంతకం చేసి, జంతువును బలి యివ్వడానికి అనుమతి ఇచ్చాడు ప్రసిడెంటు.

దున్నపోతును బలిపీఠం దగ్గరికి తెచ్చారు.

పలకలు, తాజాలు మోగాయి. బూరుగలు, కొమ్ములు ఊదుతున్నారు. ఫంబజోళ్ళు పాటలు పాడుతున్నాయి.

జాజి చూపు అంకడి మీద ఉంది. అంకడి చూపు జాజి మీద ఉంది. అందరి చూపులు దున్నపోతు మీద ఉన్నాయి. పోకిరి పిల్లల చూపులు దోరవయసుల్ని దొంగిలిస్తున్నాయి. పొక్కడి చూపు పదునితేలిన కత్తి మీద వుంది. నాగయ్య చూపు రుద్రయ్య మీద ఉంది. రుద్రయ్య చూపులు నాగయ్యమీద ఉన్నాయి. ఇద్దరి చూపులు అంకడి మీద ఉన్నాయి.

బలి జంతువుకు నిమ్మకాయలు చుట్టి, హారతి యిచ్చాడు పూజారి.

అమ్మవారు ఆవహించి, పూనకం వచ్చినవాళ్ళు నాలుక బయట పెట్టి ఊగుతున్నారు.

జాతరకు వచ్చిన జనం బలి చూడటానికి తొక్కిసలాడుతున్నారు.

ఇంతలో — తప్పెటలు, కొమ్ములు, ఫంబజోళ్ళు ముమ్మరంగా మోగాయి.

అమ్మవారికి దణ్ణం పెట్టి — దున్న పోతు మెడనరము కోసేసాడు పొక్కడు. తర్వాత గట్టిగా — "కితాతాతాతాతాతాతా," అని అరుస్తూ పొక్కడు కత్తి పైకెత్తి బలంగా ఒక్కవేటు బలి జంతువు మెడమీద వేశాడు.


అంతే!

భయంకరమైన ఒక పెద్దగావుకేక పిడుగు పడ్డట్లు ఆ ప్రాంతమంతా ప్రతి ధ్వనించింది.

దున్నపోతు మెడ దగ్గిర తాడు పట్టుకొని నిలబడి ఉన్న అంకడిని పొక్కడు బలికత్తి వేసే సమయంలో చుట్టూ

### వీక్ నెస్

प्रसाद



గుంపుగా ఉన్న జనంలో నుండి ఏదో ఒకచేయి వెనుక నుండి బలంగా ముందుకు తోసింది. దాంతో వాడు దున్నపోతు మెడమీద పడ్డాడు. పొక్కడు వేసిన బలికత్తి సరిగ్గా అంకడి మెడ మీద పడింది. అమాంతం అంకడి తల అల్లంత దూరంలో ఎగిరి పడింది.

అంకడిని తోసిన చెయ్యి ఎవరిదో ఒక్క నాగయ్యకు మాత్రమే తెలుసు.

దున్నపోతు మెడ సగంతెగి హృదయ విదారకంగా వేలాడుతూ తన్నుకుంటోంది.

అనుకోని విధంగా తమ్ముడు తల ఎగిరి పడటంతో పొక్కడు బిగుసుకుపోయాడు.

అక్కడ అందరూ నిశ్చేష్టులయిపోయారు.

నాగయ్య, ప్రసిడెంట్ రుద్రయ్య కళ్లతోనే సైగలు చేసుకొని, తృప్తిగా గాలి పీల్చుకున్నారు.

ఈ దృశ్యం చూసిన జాజి స్పృహతప్పి కుప్పగా కూలిపోయింది.

జాతర భయపడి పారిపోయిందా అన్నట్లు ఆ ప్రదేశమంతా నిశ్శబ్దంగా మారిపోయింది.

ఇది చూసి మందుకొట్టే మతిస్థిమితం తప్పి మత్తుగా ఊగుతున్నట్లుగా ఊగుతోంది అమ్మోరి ముందున్న వేపచెట్టు.

ఈ విడ్డూరానికి పొయ్యిమీద కుతకుతమని ఉడుకుతున్న పొంగళ్ళు మాత్రం గుసగుస లాడుకుంటు న్నాయి.

లచ్చివి అంకడి శవం మీద పడి గుండెలవిసేలా ఏడుస్తూంది.

ఇంతలో అక్కడికి యస్.ఐ.వచ్చాడు.

*   *   *

పొక్కడు కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

సబ్ ఇన్స్పెక్టర్ విచారణ పూర్తి చేశాడు.

పొక్కడి చేతులకు బేడీలు వేశారు.

"మావా! నువ్వూ ఎల్లిపోతే నాకు దిక్కెవరు. నాబతుకు బలి చేసి పోవద్దు మావా," అని మరిది శవాన్ని వదిలి పెట్టి పొక్కడి కాల్లను చుట్టుకొంది లచ్చివి.

పొక్కడు పొగిలి పొగిలి ఏడుస్తున్నాడు.

పోలీసులు పొక్కడ్ని బరబరా లాక్కెల్లి జీపు ఎక్కించారు.

అందరి కడుపు మంట లాంటి ఎర్రటి దుమ్ము పైకెగురు తూంటే జీపు ముందుకు కదిలిపోయింది.

"నాకు దున్నపోతుల బలివద్దు. కోళ్ళను కొయ్యొద్దు. మేకపోతులను, పొట్టేళ్ళను నరకవద్దు. అమాయకుల ప్రాణాల్ని అసలే బలి చెయ్యొద్దు. నాకే బలి వద్దు. ఈ నెత్తుటి కూడు నాకొద్దు. నాకు కావలసింది ఇలాంటి బలికాదు. ఇలాంటి నెత్తుటి కూడు కాదు. మీలో ఉన్న కులాంతరాల్ని బలి యివ్వండి. ఆర్థిక అసమానతల్ని బలియివ్వండి. మూఢాచారాల్ని, మత మౌఢ్యాన్ని బలియివ్వండి." అని గొంతెత్తి అరవాలను కొన్నది గంగమ్మ. కానీ అరవలేక పోయింది.

ఎందుకంటే?

దరిద్రుడు మొదలు దేవుడు వరకు ఆ ఊళ్ళో ఏ కార్యానికైనా ఈ పెద్దల మీద ఆధారపడవలసిందే. వాళ్ళకు వ్యతిరేకంగా తాను నోరు విప్పితే, తనకిదే ఆఖరు జాతర అవుతుందని భయపడిందేమో గంగమ్మ! అందుకే ఊరి జనంతోపాటు తాను కూడా నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది. *



కోపం

ఇంట్లో విషయాలు మాట్లాడుకుంటున్నారు నారాయణ, నరసింహం

"మా ఆవిడ మీద కోపం వస్తే ఆ రోజు అన్నం తినడం మానేస్తాను నేను" అన్నాడు నారాయణ

"నేనైతే మా ఆవిడ మీద కోపం వచ్చిన రోజు అసలు వంటే మానేస్తాను" చెప్పాడు నరసింహం.

—డి. సత్యమూర్తి (అమలాపురం)


నూతన యవ్వనం పొందండి సంతానవంతులు కండి. చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి.



హస్త ప్రయోగము వలన కలుగు నరముల బలహీనత. శీఘ్రస్ఖలనము అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి. సంతానములేకపోవుట. సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స, పోస్టుద్వారా చికిత్స కలదు.

క్యాంపులు: ప్రతి ఆదివారం భీమవరం. షణ్ముఖలాడ్జి నందు ఉ॥9 గం॥నుండి సా॥ 6-30.గం॥వరకు ప్రతినెల 1, మరియు 16, తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సర లో మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి 9గం॥ వరకు.

డా॥డి. మార్కండేయులు

ఆయుర్వేద భిషక్, సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్ట్

పామర్రు రోడ్, గుడివాడ-521 301

ఫోన్స్: 522 అండ్ 540




పొగతాగేవారూ, గాయకులూ, వక్తలూ, వీరికోసం

కూలెక్స్®

ఔషధీయ క్షమైన దగ్గు బిళ్ళలు

గొంతులోని అసౌకర్యాన్ని సొమ్మపరుస్తుంది. చల్లగా ఉండే అనుభవాన్నిస్తుంది.

పదిగల ప్యాక్‌లోనూ, క్యాండీ ప్యాక్‌లోనూ దొరుకుతుంది.

భారతదేశంలో తయారుచేసేవారు:

మెహతా యునానీ ఫార్మసీ & కంపెనీ

అమృతమంథన్ హవుస్, సదర్, రాజ్‌కోట్-360 001.

ఆంధ్ర ప్రదేశ్‌లో విక్రేతలు:
శక్తి మార్కెటర్స్
4-5-12 చదువుల వారి వీధి
కర్రపేట, అనకాపల్లి-531 001.